ధన్యాసి ఖండ ఏక

షోడశ కళానిధికి - షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును - సమర్పయామి

అలరు విశ్వాత్మకున - కావాహనమిదె సర్వ
నిలయున కాసనము - నెమ్మినిదే
అలగంగాజనకున - కర్ఘ్య పాద్యాచమనాలు
జలధి శాయికిని మ - జ్జనమిదే

వరపీతాంబరునకు - వస్త్రాలంకారమిదె
సరి శ్రీమంతునకు భూ - షణములివే
ధరణీధరునకు గం - ధపుష్ప ధూపములు
తిరమిదె కోటి సూర్య - తేజునకు దీపము

అమృత మధనునకు - నదివోనై వేద్యము
గమి చంద్రనేత్రునకు - గప్రవిడెము
అమరిన శ్రీవేంక - టాద్రి మీద దేవునికి
తమితో ప్రదక్షిణాలు - దండములు నివిగో

శ్రీ వేంకటేశ్వరుడు షోడశ కళానిధి. చంద్రునికి 15 కళలే ఉంటాయట. 16వ కళ షోడశీ కళ పరమేశ్వరపాలభాగాలంకారం. ఈ సంకీర్తనంలో 15 ఉపచారాలే చెప్పబడ్డ వి. కర్పూర నీరాజనం అమ్మవారి పేర వేరే కృతిలో ఉన్నది.

శ్రీవిద్యాప్రకరణంలో పంచదశి, షోడశి మంత్రములున్నవి. షోడశి చెప్పుకొన్నవారు లమిత్యాది పంచపూజలూ, షోడశ, చతుష్షష్ట్యుపచారాలూ చేసేటప్పుడు 'పరికల్పయామి' అని అర్పిస్తారు. పంచదశీ సాధకులు సమర్పయామి అని సమర్పిస్తారు ఆయా ఉపచారా లని. 'సమర్పయామి' అన్న క్రియాపదం ద్వారా అన్నమాచార్యులు ఈ విషయాన్ని సూచి స్తున్నారు. లమిత్యాది పంచపూజావిధి వస్తువుగా ఈ సంకీర్తనలో ధ్వనిస్తున్నది.'ధరణీధరు నకు గంధ పుష్పధూపములు' అన్నప్పుడు 'ఓంలంపృథివీతత్వాత్మనే శ్రీ వేంకటాచలపతయే గంధం సమర్పయామి' అన్న భావం, 'అమృతమధనునకు అదివోనైవేద్యము' అన్నచోట ఓం వం అమృతతత్వాత్మనే శ్రీ వేంకటాచలపతయే అమృతమహానైవేద్యం సమర్పయామి' అన్న ఊహ ప్రకటింపబడ్డాయి. ఈ 'సమర్పయామి' చివర 'నమః' చేర్చవలసి ఉంది. అన్నమాచార్యులు సర్వ స్వతంత్రులు గనుక 'నమః' ని తెలుగు చేసి 'దండములు నివిగో'

అనగలిగారు. 'గీతం శ్రావయామి' అని ఈ సంకీర్తనం పాడి 16 ఉపచారాలూ చేసిన ఘనుడు అన్నమాచార్యులు ఈ 'సమర్పయామి' అన్న క్రియా పదాన్ని ప్రతిఉపచారం చివర తాళం చెడకుండా చెప్పవచ్చు. అన్నమాచార్యుల సంగీత సాహిత్య మంత్రశాస్త్ర పరిజ్ఞాన దేవతార్చనా విధాన సమ్మేళనా ప్రతిభా సామర్థ్యాలకు ఈ సంకీర్తన ఒక ఉదాహరణ.